తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట యాదాద్రి భువనగిరి
బుధవారం
19 ఫిబ్రవరి 2025
పేజీలు : 8

## కోరిన కోరికలు తీర్చే లింగమంతుల స్వామి వారి

# జాతరకు పోటెత్తిన భక్తులు

### ఘనంగా చంద్రపట్నం కార్యక్రమం



**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):** సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని దురాజ్ పల్లి పెద్దగట్టు లింగమంతుల స్వామి వారి భాగంగా మూడవ రోజైన మంగళవారం చంద్రపట్నం కార్యక్రమం కన్నుల పండుగగా కొనసాగింది.పసుపు కుంకుమలతో అలంకరించి పంచవర్ణములతో వేసిన చంద్రపట్నంపై దక్షిణం దిక్కున లింగమంతుల స్వామి వారిని, ఉత్తరం దిక్కున మాణిక్యమ్మ దేవిని కూర్చోబెట్టి కళ్యాణం జరిగే కార్యక్రమంలో భాగంగా యాదవ



### ఛాయా సోమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు

# అవసరమైనన్ని ఏర్పాటు చేయాలి

### కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నలగొండ బ్యూరో,ఫిబ్రవరి18,జనం సాక్షి** మహాశివరాత్రి సందర్భంగా నల్గొండ జిల్లా,పానగల్ సమీపంలో ఉన్న ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 25నుండి 27వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల విషయమై మంగళవారం ఆమె ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించారు.బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా ఈ నెల 26 న శివరాత్రి సందర్భంగా భక్తులకు ఇబ్బంది కలగకుండా తాగునీరు, అంబులెన్స్, భారికేడింగ్, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, అంబులెన్స్ ఏర్పాటు చేయాలని,నలుగురు డాక్టర్లను అంబులెన్స్ తో సహా సిద్ధంగా ఉంచాలని,తగినంత పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా మహిళ కానిస్టేబుళ్లను ఎక్కువగా నియమించాలని,ప్రధాన రహదారి నుండి దేవాలయం వరకు పూర్తిస్థాయిలో లైటింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని,విద్యుత్ మిగతా2లో

### బిసి బహుజనుల ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ ను

# గెలిపించండి



**కొండమల్లేపల్లి,ఫిబ్రవరి 18 (జనంసాక్షి) :** నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పూల రవీందర్ ను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి బహుజన కులాల ఐక్యతను చాటాలని మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్, బిసి జనసభ రాష్ట్ర అధ్యక్షులు పుట్టం పురుషోత్తం రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తెలంగాణ టూరిజం హరిత రెస్టారెంట్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల సమస్యలు, ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలు పరిష్కారం కావాలంటే పూల రవీందర్ ను గెలిపించాలన్నారు. పెండింగ్ లో ఉన్న బిల్లులు, డిఏలు, పిఆర్సి, ప్రమోషన్లు, ట్రాన్స్ఫర్లు, మోడల్ స్కూల్ లో పనిచేసే టీచర్లకు జీతాల చెల్లింపు, కేజీబీవీ టీచర్లకు టైం స్కేలు, రెగ్యులరైజేషన్, ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయ, అధ్యాపకుల మిగతా2లో

# నీటి ఎద్దడి లేకుండా చూడండి

### వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా ముందస్తు జాగ్రత్తలు : కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్లగొండ బ్యూరో,ఫిబ్రవరి18,జనం సాక్షి వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం ఆమె నల్గొండ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నల్గొండ మున్సిపాలిటీ పరిధిలో తాగునీరు,విద్యుత్,పారిశుద్ధ్యం, తాగునీటి ట్యాంకుల నిర్మాణ పనులు,ఇతర అభివృద్ధి పనులు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. వేసవికాలం ప్రారంభమైనందున ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని వార్డ్ అధికారులను ఆదేశించారు. అవసరమైతే వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని చెప్పారు. గత ఏడాది మంచినీటి డిమాండ్ ఆధారంగా ఈ సంవత్సరం సైతం తాగునీటిని సరఫరా చేయాలని సూచించారు.ఓవర్ హెడ్ ట్యాంకులు, మంచినీటి ట్యాంకులన్నింటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని,తాగునీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ తో శుభ్రం చేయాలని తెలిపారు.నల్గొండ మున్సిపల్ శివారు కాలనీలలో సైతం తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని,ఎక్కడైనా విద్యుత్ సరఫరా అంతరాయం వల్ల తాగునీటికి ఇబ్బంది ఏర్పడితే వెంటనే వాటిని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.వేసవిలో విద్యుత్తు అంతరాయం లేకుండా చూడాలని కోరారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా కు ఎక్కడైన విద్యుత్ సమస్య ఉంటే తగు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. మిగతా2లో

# కోరిన కోరికలు తీర్చే లింగమంతుల స్వామి వారి జాతరకు పోటెత్తిన భక్తులు







పూజర్లు లింగమంతుల స్వామి కళ్యాణం కథను, శ్రీ కృష్ణుడి చరిత్రపై పాటలు పాడుకుంటూ ఎంతో వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమాన్ని భక్తులు ఎంతో ఆసక్తిగా తిలకించారు.ఈ సందర్భంగా యాదవ పూజార్లతో కలిసి దేవాలయ కమిటీ చైర్మన్ పోలేబోయిన నర్సయ్య యాదవ్ మాట్లాడుతూ చంద్రుడు ఆకాశంలో నిండుగా ప్రకాశించే పౌర్ణమి రోజు అంటే లింగమంతుల స్వామి వారికి ఇష్టమైన రోజు కాబట్టి ప్రతి పౌర్ణమికి భక్తులు ఇక్కడికి వచ్చి స్నానం చేసి తడిబట్టలతో దర్శనం చేసుకొని నిద్రిస్తే కోరిన కోరికలు తీరుస్తారని భక్తులు నమ్ముతారని అన్నారు.చాలా సంవత్సరాల నుండి ప్రతి రెండేళ్లకి ఒక్కసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజు నుండి ఐదు రోజులు జరిగే జాతరకు తెలుగు రాష్ట్రాలే కాకుండా చుట్టు పక్కల రాష్ట్రాల నుండి కుల మతాలకి అతీతంగా వచ్చి స్వామి వారి దర్శించుకొంటారని తెలిపారు.అదే ఆనవాయితీ ప్రకారం కోరిన కోరికలు తీర్చే లింగమంతుల స్వామి వారి జాతర ఈ నెల 16 నుండి 20 వరకు ఐదు రోజులు పాటు అంగరంగ వైభవంగా జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే స్వామి వారిని దాదాపు లక్షలాది మంది దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారని తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం గుట్ట చుట్టూ పరిసర ప్రాంతాలలో నిరంతరం పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేస్తున్నారని,త్రాగు నీటి వసతి , భక్తుల కొరకు చలవ పందిర్లు ఏర్పాటు చేశామని తెలిపారు.పోలీస్ శాఖ వారు వాహనాలను దారి మళ్ళించి ట్రాఫిక్ ని నియంత్రిస్తున్నారని అన్నారు.లక్షలాది మంది భక్తులు వచ్చిన అందరికి స్వామి వారి దర్శనం జరిగేలా క్యూ లైన్ ఏర్పాటు చేశామని తెలిపారు.ఆర్టిసి జాతర కొరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులను భక్తులు అధికంగా వినియోగించుకొంటున్నారని,భక్తులకి ఎలాంటి అసౌకర్యం కల్గించకుండా జిల్లా అధికార యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మెంతబోయిన, తండు వంశీయులు, భైరాని తేరాచీరల యాదవ పూజార్లు, దేవాలయ పాలకవర్గం తదితరులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి లేకుండా చూడండి

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వార్డ్ ఆఫీసర్లు లేదా సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్లు వెంటనే మున్సిపల్ కమిషనర్ కు సమాచారం అందించాలని అన్నారు.వీధి దీపాల ద్వారా విద్యుత్ ఆదా చేసేందుకు చర్యలు తీసుకోవాలని,అవసరమైన సమయంలో మాత్రమే వీధి దీపాలు వినియోగించాలని, సాధ్యమైనంతవరకు తక్కువ విద్యుత్తును వినియోగించాలని చెప్పారు. వనమహోత్సవం కింద నాటిన మొక్కలు వేసవిలో ఎండల కారణంగా చనిపోయెందుకు ఆస్కారం ఉందని,అలా కాకుండా ఎప్పటికప్పుడు ట్యాంకర్ల ద్వారా చెట్లకు నీరు పోయాలని అన్నారు. మంచినీటి సరఫరా,విద్యుత్ సరఫరా పారిశుధ్యం తదితర విషయాలలో వార్డు అధికారులు అందుబాటులో ఉంటూ పర్యవేక్షించాలని చెప్పారు. ఎక్కడైనా విద్యుత్ సరఫరాకు సమస్య ఉన్నట్లయితే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు.ఇటీవల వీఆర్వోల నుండి వార్డ్ ఆఫీసర్లు గా నియమించిన సిబ్బంది వారి పని విధానాన్ని తెలుసుకోవాలని కోరారు.నల్గొండ మున్సిపల్ పరిధిలో చేపట్టిన తాగునీటి ట్యాంకుల నిర్మాణ పురోగతిని ఆమె సమీక్షిస్తూ సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో శానిటేషన్,తడి చెత్త,పొడి చెత్త,చెత్త సేకరణ,వర్మి కంపోస్ట్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ సూచనలు చేశారు.అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్,ఈ ఈ రాములు, ఆర్డబ్ల్యూఎస్,మిషన్ భగీరథ,విద్యుత్,మున్సిపల్ వార్డ్ ఆఫీసర్లు,తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.
అనంతరం జిల్లా కలెక్టర్ కోమటి రెడ్డి ప్రతీక రెడ్డి జూనియర్ కళాశాల వెనక వైపున ఉన్న అక్క చెలిమ గుట్ట వద్ద నిర్మిస్తున్న వాటర్ ట్యాంకు పనులను, మర్రిగూడ బై పాస్ లో ఎం ఎన్ ఆర్ గార్డెన్ శనేశ్వర గుట్ట వద్ద నిర్మిస్తున్న వాటర్ ట్యాంకు పనులను,మునుగోడు రోడ్డులో స్వర్గపురి హిందూపూర్ వైకుంఠ దామాన్ని పరిశీలించారు.



# ఛాయా సోమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు అవసరమైనన్ని ఏర్పాటు చేయాలి :కలెక్టర్ ఇలా త్రిపాఠి

సరఫరాలో అంతరాయం, లేకుండాచూడాలని ఆదేశించారు. విద్యుత్ అధికారులు విరిగిపోయిన,వంగిపోయిన విద్యుత్ స్తంభాలను సరిచేసి విద్యుత్తు వల్ల ప్రమాదం జరగకుండా ఆడిట్ నిర్వహించాలని చెప్పారు. కోనేటితోపాటు,దేవాలయానికి వచ్చే రహదారికి ఇరువైపులా భారీ కేడింగ్ చేయించాలన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ పక్కనే ఉన్న తాగునీటి శుద్ధి కేంద్రాన్ని తనిఖీ చేసి నల్గొండ పట్టణానికి సరఫరా చేస్తున్న తాగునీటి వివరాలు,నీటి శుద్ధి వివరాలను మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వంశీకృష్ణ ద్వారా అడిగి తెలుసుకున్నారు.ఆ తర్వాత డంపింగ్ యార్డ్ పక్కన ఉన్న జంతు జనన కేంద్రాన్ని సందర్శించి స్టెరిలైజేషన్ తదితర వివరాలను కనుక్కున్నారు. నల్గొండ ఆర్డిఓ వై.అశోక్ రెడ్డి,డిఎస్పి శివరామిరెడ్డి,సీఐ రాఘవేంద్రరావు,మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్,ఆహార భద్రత అధికారి స్వాతి,తహసిల్దార్ శ్రీనివాస్,ఛాయా సోమేశ్వర దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బాలకృష్ణ,తదితరులు ఉన్నారు.





# జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసిన మాజీ ఎంపిపి దూదిపాల రేఖా శ్రీధర్ రెడ్డి

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 18 ( జనంసాక్షి ):
నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని జడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ కార్యలయంలో కొండమల్లేపల్లి మాజి ఎంపిపి దూదిపాల రేఖా శ్రీధర్ రెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వారు కొండమల్లేపల్లి మండలంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు అందజేసిన స్టడి మెటీరియల్స్ చూపించారు. విద్యార్థుల కోసం దూదిపాల రేఖా శ్రీధర్ రెడ్డి చేస్తున్న కార్యక్రమాల గురించి తెలుసుకొని కలెక్టర్ ప్రశంసించారు. అలాగే పలు అభివృద్ది కార్యక్రమాలపై కలెక్టర్ తో చర్చించారు. అనంతరం కొండమల్లేపల్లి హాస్టల్స్ సందర్శనలో భాగంగా ఎప్పటికప్పుడు హాస్టల్స్ సందర్శించడం విద్యార్థుల వసతులపై కఠినంగా వ్యవహరించడం, జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమాల పై సమీక్షలు నిర్వహించడంపై అభినందనలు తెలిపారు. కొండమల్లేపల్లి మండల పరిధిలో మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి తమ సొంత ఖర్చులతో పాఠశాలల మరమ్మత్తులు, హాస్టల్ వసతులలో విద్యార్థులపై చూపించే శ్రద్ధ, గ్రామాలలో, తండాలలో నీటి దాహార్తిని తీర్చుడానికి బోర్లు వేయించడం, నిరుపేదలకు ఇండ్లు కట్టించడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్, మెటీరియల్ అందచేయడం తోపాటు శస్త్ర ఆపరేషన్ లు చేయించడం, ఆర్థిక ఇబ్బందులు ఎదురుకుంటూ ఉన్నత చదువులకు వెళ్ళలేని విద్యార్థులకు కోచింగ్ సదుపాయం, మెటీరియల్ అందచేయడం, జర్నలిస్ట్ మిత్రులకు ఆరోగ్య భీమా సదుపాయం కల్పించడం లాంటి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ ప్రశంసించారు.

# బిసి బహుజనుల ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ ను గెలిపించండి

సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ, పాఠశాలలు బలోపేతం కావాలంటే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ ను గెలిపించాలని కోరారు. అనంతరం హిందూ బిసి మహాసభ జాతీయ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్లు మాట్లాడుతూ చట్ట సభల్లో బిసి కులాల లెక్కలు ఉన్నప్పుడే హక్కులు ఉంటాయన్నారు. ఇప్పటికి చట్ట సభల్లో ఎస్సి, ఎస్టిల లెక్కలు ఉన్నాయన్నారు. జాతీయ చట్ట సభల్లో బిసిల హక్కులు ఉల్లంఘణలు జరుగుతున్నాయని అన్నారు. అందుకే బిసిల ఉద్యమం నిర్మించ వలిసిన అవసరముందని అన్నారు ఎన్నో అటు పోట్లు తట్టుకొంటూ బీసి ఉద్యమం ఈ దశకు చేరుకుందని దీనిని కాపాడు కోవలిసిన అవసరం ఉందని అందులో భాగంగానే పూల రవీందర్ గెలుపు బీసి ఉద్యమానికి దిక్సూచిగా మారుతుందని అన్నారు. పూల రవీందర్ గెలుపు బీసిల మలుపు అన్నారు. వారివెంట మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షులు వాసుదేవుల వెంకట నర్సయ్య, హిందూ బీసి మహాసభ రాష్ట్ర అధ్యక్షులు పర్వతం సతీష్, దేవరకొండ నియోజకవర్గ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కోట్ల జగదీష్ పటేల్, నిడమానూరు మున్నూరు కాపు సంఘం మండలం అధ్యక్షులు లోకాసాని నరేందర్, విశ్రాంత ఉపాధ్యాయులు వంగ పెద్దన్న, నంద్యాల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## ఏఎస్పీ నాగేశ్వరరావును పరామర్శించిన మాజీమంత్రి జగదీష్ రెడ్డి



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** సూర్యాపేట జిల్లా అదనపు ఎస్పీ నాగేశ్వరరావు సతీమణి నూతన్ ఫ్లవర్ సోమవారం సాయంత్రం ఎల్బీ నగర్ కామినేని హస్పిటల్ లో తుదిశ్వాస విడిచారు.ఆమె గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కన్ను మూశారు.విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి ఆమె మృతదేహంపై పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు..

# నవ భారత్ ఇన్నోవేటివ్ పాఠశాలలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

**వివిధ వేషధారణలో పలువురిని ఆకట్టుకున్న విద్యార్థులు**

**విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తూ ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడమే మా పాఠశాల ముఖ్య ఉద్దేశం**






**దేవరకొండ ఫిబ్రవరి 18 (జనంసాక్షి)**
దేవరకొండ పట్టణంలోని నవభారత్ ఇన్నోవేటివ్ పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా, అధికారులుగా, ప్రజా ప్రతినిధులుగా వివిధ వేషధారణలలో విధులు నిర్వహించి అందర్నీ ఆకట్టుకున్నారు . ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపల్ మహమ్మద్ ఘయసోద్దీన్ మరియు కరస్పాండెంట్ మహమ్మద్ ఉస్మాన్ ఖాన్ బహుమతులు ప్రధానం చేశారు. సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ చిన్నతనం నుండే విద్యార్థులకు పాఠ్యాంశాలను బట్టి పట్టించడం కాకుండా,సామాజిక బాధ్యతలను నేర్పించాలని తమ పాఠశాలలో సెల్ఫ్ గవర్నమెంట్ నిర్వహించామని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తూ ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడమే ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి తల్లిదండ్రులకు, సమాజానికి, దేశానికి మంచి పేరు ప్రతిష్టలు తేవాలని కోరారు.



## ఇంద్రియాలలో టీబి నిర్మూలనకై డ్రోన్ సేవలు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 18 (జనం సాక్షి):
ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ బీబీనగర్ సహకారంతో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఇంద్రియాల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కేంద్రంలో క్షయ నిర్మూలనలో భాగంగా ఐసిఎంఆర్ ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా స్పూటం శాంపిల్స్ భువనగిరిలోని జిల్లా ఆసుపత్రికి పంపించారు. భారతదేశంలో టీబి నిర్మూలన లక్ష్యంగా దేశంలో నాలుగు రాష్ట్రాలలో ఒక్కొక్క కేంద్రంలో ఈ కార్యక్రమంను పైలట్ ప్రాజెక్టుగా నిర్వహించడం జరుగుతుంది. ఈ సేవలు మండలంలో నిర్ధారించిన ప్రణాళిక ప్రకారం అన్ని గ్రామాలలో అందుబాటులోకి త్వరలో రానున్నాయని వైద్యాధికారిని డాక్టర్ కపిల తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ ఎంల్ హెచ్ పి సీనియర్ టీబి సూపర్ వైజర్ శ్రీనివాసరెడ్డి ఆరోగ్య ఉప కేంద్రం ఆరోగ్య కార్యకర్తలు సునీత టి.బి నోడల్ పర్సన్ ఎంఏ బేగ్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## భర్తను హతమార్చిన భార్య,ప్రియుడుకి సహకరించిన స్నేహితులకు జీవిత ఖైదు

**నల్గొండ బ్యూరో,ఫిబ్రవరి18,జనంసాక్షి**
అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని,ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య,ప్రియుడుకి సహకరించిన స్నేహితులకు జీవిత ఖైదును ఎడి-జె %శ్రీశ్రీశ్రీ%-సియుఎం ఫ్యామిలీ కోర్టు జడ్జి,డి.దుర్గాప్రసాద్ విధించారు.యు/సెక్షన్.302,201,120(బి )ఆర్ / డబ్ల్యూ 34 ఐపీసీ ప్రకారం జీవిత ఖైదు,రు.5000-ప్రతి సెక్షన్ కి మొత్తం75000-జరిమానానువిధించారు.జరిమాన చెల్లించడంలో విఫలమైతే 6నెలల పాటు కఠిన జైలు శిక్ష విధించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఒక ప్రకటనలో తెలిపారు.వివరాలలోకి వెళితే, నల్గొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంద వారిగూడెం రోడ్డు సమీపం లో సోమ కేశవులు భార్య స్వాతితో కలిసి జీవనం సాగిస్తున్నాడు.ఇదే క్రమంలో స్వాతి,దుబ్బ ప్రదీప్ అనే వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకొని,అక్రమ సంబంధానికి భర్త కేశవులు అడ్డు వస్తున్నాడని ప్రియుడు దుబ్బ ప్రదీప్,అతని స్నేహితులు కొడిదేటి శివకుమార్,కుంభం ప్రసాద్, చింతపల్లి నగేష్ లతో కలిసి ఎలాగైనా భర్తను హతమార్చాలని పథకం ప్రకారం భర్త సోమ కేశవులను సుత్తితో చాతి పైన కొట్టి,ఆధారాలు రూపుమాపాలని ఉద్దేశంతో, నేరపూరితంగా అంతమొందించారని పేర్కొన్నారు.ఈ కేసులో సరియైన ఆధారాలు సేకరించి కోర్టుకి అందజేసి నిందితుని శిక్ష పడే విధంగా చేసిన అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ నిగిడాల సురేష్,నల్గొండ వన్ టౌన్ ఇన్స్పెక్టర్,ప్రస్తుత నల్గొండ డీఎస్పీ కె శివరాం రెడ్డి,నల్గొండ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి,ప్రాస్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.జవహర్ లాల్, సీడీఓఎస్ వి.శ్రీనివాస్,హెడ్ కానిస్టేబుల్ బి.వెంకటేశ్వర్లు పోలీస్ కానిస్టేబుల్,లైసెనింగ్ ఆఫీసర్స్ హెడ్ కానిస్టేబుల్ పి.నరేందర్,పిసి ఎన్.మల్లికార్జున్ లను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అబినందించారు.రివార్డ్ అందచేస్తామన్నారు.

## భూ నిర్వాసితుల గోడు వినని ప్రజా ప్రభుత్వం

**19 మంది భూ నిర్వాసితులకు రానీ డిఎల్ఎస్, ఆర్అండ్ఆర్ ప్యాకేజ్**

**భూ నిర్వాసితులకు న్యాయం జరిగే నా.. ప్రజా ప్రభుత్వంలో**

**మర్రిగూడ, ఫిబ్రవరి 18,( జనంసాక్షి)**
మర్రిగూడ మండలంలోని శివన్నగూడ గ్రామంలో డిండి ఎత్తిపోతలో భాగంగా నిర్మిస్తున్న రిజర్వాయర్ లో ముంపు గ్రామమైన నర్సిరెడ్డిగూడెం గ్రామ ప్రజల దీన గాథ... మంగళవారం రిజర్వాయర్ పనులను అడ్డుకొని తమ నిరసన తెలియజేశారు,గత మూడు సంవత్సరాల నుండి తిరగని ప్రభుత్వ కార్యాలయం లేదు, ప్రజా ప్రతినిధి లేడు చెప్పులు అరిగేలా తిరిగిన తమ గూడు పట్టించుకోవడంలేదని భూ నిర్వాసితులు కన్నీరు మున్నీరవుతున్నారు, 2017లో రిజర్వాయర్ కట్ట నిర్మాణంలో మొదట భూములు కోల్పోయిన గ్రామస్తులు ముందుగా బ్రతుకు తెరువు కోసం హైదరాబాద్ కు వలస వెళ్లారు, అయితే 21 ఆగస్టు 2021 నాడు నర్సిరెడ్డి గూడెం గ్రామంలో ఉన్నవారికి మాత్రమే డిఎల్ఎస్ నెంబర్లు వేసి నష్టపరిహారం ఇవ్వడం జరిగింది, గ్రామంలో లేని వారికి జాబితాలో పేర్లను నమోదు చేయలేదు, దీనివలన భూ నిర్వాసితులకు రావలసిన ఇంటికి రావాల్సిన నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, ఇళ్ల స్థలాలు 19 మందికి రాలేదని భూ నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో మర్రిగూడ మండలం మాజీ అధ్యక్షులు ముద్దం నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ భూ సమస్యలను పరిష్కరించాలి

**భూభారతి లాగిన్ అమలు కోసం రైతుల ఎదురుచూపు**

**సిపిఎం మర్రిగూడ మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య**

**మర్రిగూడ, ఫిబ్రవరి 18, ( జనంసాక్షి)**



మర్రిగూడ మండల లోనిపెండింగ్ భూ సమస్యలను పరిష్కరించాలని సిపిఎం మర్రిగూడ మండల కమిటీ ఆధ్వర్యంలో మర్రిగూడ తాసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది, సిపిఎం మర్రిగూడ మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా భూభారతి లాగిన్ అమలు కోసం రైతులువేయి కనులతో ఎదురుచూస్తున్నారు, భూభారతి లాగిన్ ఓపెన్ అయితదని ఎదురుచూస్తూ మండల తహసిల్దార్ కార్యాలయం చుట్టూ ప్రతినిత్యము తిరుగుచున్నారు, రైతుల భూ పెండింగ్ సమస్యలను పరిష్కరించేభూభారతి లాగిన్ ఓపెనింగ్ చేసి రైతుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు, భర్తలు చనిపోయిన వారు తల్లిదండ్రులు చనిపోయిన వారు సీలింగ్ భూములు ప్రభుత్వ బంజరాయి భూములు కాస్తు కబ్జాగాలి రైతులు జీవనం గడుపుతున్నారు, అటువంటి భూములను పట్టా చేయమని రైతులు తిరుగుచున్న పరిష్కారం లేక ఇబ్బంది పడుతున్నారు, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి రాగానే పెండింగ్లో ఉన్న భూ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి నేటికీ ఏ ఒక్క భూ సమస్య పరిష్కరించలేదని అన్నారు ,ఇప్పటికైనా రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం కనికరించి భూభారతి లాగిన్ పథకం రెవెన్యూ అధికారులకు అనుమతి ఇవ్వాలని అన్నారు, నీలకంఠం రాములు ,రియావుద్దీన్, పాండు, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రెండో విడత దళిత బంధు నిధులు విడుదల చేయాలి

**చేయకుంటే మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయం ముట్టడిస్తాం**

**దళిత బందు సాధన కమిటీ రాష్ట్ర అధ్యక్షులు: కొగిలా మహేష్**

**నల్గొండ టౌన్,ఫిబ్రవరి18,జనంసాక్షి**
గత రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దళిత బంధు పథకం రెండో విడత అర్హులైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ ఇచ్చి,నిధులు కేటాయించిందని ఎన్నికల నోటిఫికేషన్ తో ఆగిపోయిన నల్లగొండ నియోజకవర్గంలోని1050 మంది దళిత లబ్ధిదారులకు, వెంటనే నిధులు విడుదల చేయాలని దళిత బంధు సాధన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కోకిల మహేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నల్లగొండ అంబేద్కర్ భవనంలో దళిత బంధు సాధన కమిటీ ఉమ్మడి జిల్లా బాధితుల సమావేశం బడుపుల శంకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మహేష్ మాట్లాడుతూ దళిత బంధు నిధులు విడుదలై, నేటికీ దళిత లబ్ధిదారులకు అందించకపోవడం అన్యాయమని అన్నారు. రాష్ట్రంలో హుజూరాబాద్,మధిర నియోజకవర్గాలలో రెండవ విడత దళిత బంధు అమలు చేసిన, నల్లగొండ జిల్లాలో అమలు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారినా దళితుల రాతలు మారలేదని, దళితుల పేర మంజూరైన నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులతో పెద్ద ఎత్తున పోరాడుతామని తెలియజేశారు.






## జాతీయ స్థాయి సీనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైన అనిల్ యాదవ్

**నేరేడుచర్ల( జనంసాక్షి ):**
మండలంలో కల్లూరు గ్రామానికి చెందిన సంకబుడ్డి అనిల్ యాదవ్ జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల ఆదిలాబాద్ లో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో సూర్యాపేట జిల్లా ప్రథమ స్థానం సాధించడంలో అనిల్ యాదవ్ ఆల్ రౌండర్ ప్రతిభ కనబరిచాడు. రాష్ట్రస్థాయి పోటీల అనంతరం రాష్ట్రవ్యాప్తంగా 25 మంది కబడ్డీ క్రీడాకారులను ఎంపిక చేసి వారికి ప్రాక్టీస్ మ్యాచ్ లు నిర్వహించగా అనిల్ కుమార్ తన ఆల్ రౌండర్ ప్రదర్శనతో తెలంగాణ పురుషుల సీనియర్ కబడ్డీ జట్టుకు ఎంపిక అయ్యాడు. ఈనెల 20 నుండి 23 వరకు ఒడిస్సా రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేశారు. అనిల్ యాదవ్ నిరుపేద కుటుంబానికి చెందిన సంకబుడ్డి గోపి పద్మల కుమారుడు. గోపి ట్రాక్టర్ మెకానిక్ గా పనిచేస్తున్నాడు. నిత్యం తల్లిదండ్రులు మెతుకుకై చేసిన పోరు అతడిని జాతీయ స్థాయిలో రాణించడానికి అవకాశం ఏర్పడింది. కబడ్డీ కూత అంటే కల్లూరు అనే గుర్తింపు ను సంకబుడ్డి అనిల్ యాదవ్ జాతీయ స్థాయిలో నిలిపాడు. కబడ్డీ ఆటలో నిత్యం తండ్లాడుతూ కల్లూరు కు జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చాడు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తోటి క్రీడాకారులు అనిల్ యాదవ్ ఎంపిక పట్ల హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



# రెక్కల రామక్క జాతర సందర్భంగా జిల్లా స్థాయి వాలీబాల్ క్రీడలు ప్రారంభం

**ఆళ్లపల్లి ఫిబ్రవరి 18 (జనంసాక్షి):** కొమరం వంశీయుల ఆరాధ్య దైవం రెక్కల రామక్క జాతర మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా స్థాయి వాలీబాల్ క్రీడలు కొమరం రామ్మూర్తి, కొమరం రాంబాబు, మాజీ జెడ్పిటిసి కొమరం హనుమంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే రెక్కల రామక్క జాతరకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉందని, ములుగు, మహబూబాబాద్, వరంగల్, ఛత్తీస్గఢ్ ,ఖమ్మం తదితర ప్రాంతాల నుండి ఈ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. రెక్కల రామక్క దేవుడు కోరిన కోరికలు తీర్చే దేవుడని అన్నారు. మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా జాతర నిర్వహణ జరుగుతుందని, ఈ సందర్భంగా నే క్రీడలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అనంతరం క్రీడాకారులకు ,పీటీలకు జెర్సీ టీషర్టు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహణ కమిటీ సభ్యులు సత్యనారాయణ, ముత్తయ్య ,చంద్రం ,నరసయ్య, బుచ్చయ్య ,కొమరం వెంకటేశ్వర్లు ,సతీష్ ,వెంకట్ నారాయణ ,రవి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీపీఎల్ సీజన్ 2 క్రికెట్ టోర్నమెంట్

# విజేతగా మర్కోడు టీం



**ఆళ్లపల్లి ఫిబ్రవరి 18 (జనంసాక్షి)** ఎంపీపీఎల్ సీజన్ 2 క్రికెట్ టోర్నమెంట్ విజేతగా మర్కోడ్ టీం గెలుపొందింది. ఈ సందర్భంగా మొదటి బహుమతి 16000 మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి ,రెండో బహుమతిగా సుతారి కృష్ణ 10000 రంగా పురం టీంకి అందజేశారు. గెలుపొందిన టీం కి ఎంపీపీఎల్ కప్పు అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ లో క్రీడాకారులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. క్రీడల వల్ల మానసిక శారీరిక ఉల్లాసానికి ఎంతో దోహదపడుతుం దని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కొమరం హనుమంతరావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాయం నరసింహారావు, కొమరం రామ్మూర్తి ,కాంగ్రెస్ నాయకులు తాళ్లపల్లి కృష్ణారి ,వెలిశాల కార్తీక్ ఉకే కిషోర్ బాబు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# కల్లూరు ఎంపీఓగా రంజిత్ కుమార్ బాధ్యతలు స్వీకరణ



**కల్లూరు ఫిబ్రవరి 18 (జనంసాక్షి)** కల్లూరు ఎంపీఓగా రంజిత్ కుమార్ బాధ్యతలు మంగళవారం స్వీకరించారు. కల్లూరు ఎంపీఓ గా పనిచేసిన సురేష్ బాబు బదిలీపై తల్లాడ వెళ్లారు. ఆయన స్థానంలో వేంసూర్ ఎంపీఓ గా బాధ్యతలు నిర్వహిస్తున్న రంజిత్ కుమార్ బదిలీపై కల్లూరు కు వచ్చారు. రంజిత్ కుమార్ కు కార్యాలయ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీ లు శుభాకాంక్షలు తెలిపారు.

# హై టెన్షన్ తీగల వద్ద మంటలు పెట్టవద్దు

## రూరల్ తహశీల్దార్ రాం ప్రసాద్



**ఖమ్మం రూరల్, ఫిబ్రవరి18: (జనం సాక్షి )** హై టెన్షన్ తీగల వద్ద రైతు సోదరులు మంటలు పెట్టవద్దని ఖమ్మం రూరల్ తహసీల్దార్ పిల్లి రాం ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం రూరల్ మండలంలో పలు ప్రాంతాల్లో నుంచి హై టెన్షన్ తీగలు వెళ్తున్నాయని ఆ తీగల కింద తీగల దగ్గరలో వరి,పత్తి,మిరప,కంది, చెరుకు తదితర పంటలను కోసిన తర్వాత మిగిలిన చెత్తను,వ్యర్థ పదార్థాలకు నిప్పు పెట్టడం వలన పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నదని రాం ప్రసాద్ తెలిపారు.హై టెన్షన్ వైర్ కు దగ్గరలో ఎటువంటి పంటలు,చెట్లు,మొక్కలు నాట రాదని విజ్ఞప్తి చేశారు. తీగల క్రింద వ్యవసాయ బావులు తవ్వడం,పొడవైన లోహపు పైపులు, లారీలు, ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లు తీగల కింద నుంచి తీసుకపోవద్దని విజ్ఞప్తి చేశారు.మంటల వలన ప్రమాదం సంభవిస్తే ప్రభుత్వ రంగ ఆస్తులు నష్టపోవడమే కాకుండా భారీ స్థాయిలో ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని తెలిపారు.ఇట్టి విషయాన్ని గమనంలో ఉంచుకొని రైతు సోదరులు,వ్యవసాయ కూలీలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.విద్యుత్ ప్రవాహమునకు ఎటువంటి అంతరాయము ఏర్పడిన 08742-296822, 8333988856, 6300136282 నెంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.



# శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ జయంతి కి సన్నాహాలు

**చంద్రుగొండ, ఫిబ్రవరి 18(జనంసాక్షి):** శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 286 జయంతి కార్యక్రమాన్ని ఈనెల 25న ఘనంగా నిర్వహించడానికి పోకల గూడెంలో గిరిజన నాయకులు బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. చంద్రుగొండ మండల కేంద్రంలో శ్రీ సంత సేవాలాల్ మహారాజు జయంతి ఉత్సవ స్థలం వద్ద జరుపుటకు మండల వ్యాప్తంగా ఉన్న గిరిజన నాయకులు బంజారా యువకులు సమావేశం నిర్వహించి ఘనంగా చేయుటకు నిశ్చయించారు. ఉత్సవ కమిటీ సభ్యులుగా శ్రీనివాస్ నాయక్ ,మూడు బాలాజీ నాయక్, మూడు రవిచంద్రనాయక్, గుగులోతు మోహన్ నాయక్, భూక్య కుమార్ నాయక్, భూక్య రామదాస్ నాయక్, గూగు లోత్ నాయక్ , ధరావత్ సీతారాములు నాయక్, బోడ రవి నాయకులను నియమించారు.



# మీ పిల్లవాడికి వేరే స్కూలు చూసుకోండి

## కారేపల్లిలోని ప్రయివేటు స్కూల్ నిర్వాహకం

**కారేపల్లి,ఫిబ్రవరి18(జనంసాక్షి) :** నర్సరి నుండి 9వ తరగతి వరకు చదువు చెప్పిన పాఠశాలకు 10 తరగతిలో ఆ విద్యార్థులు పనికిరారట. మీ పిల్లల రెస్పాన్స్ సరిగా లేదు. స్కూల్ పెద్దల పట్ల సరైన వినయం చూపటం లేదు కాబట్టి మీ పిల్లలను వేరే పాఠశాలకు మార్చుకోండి అంటూ పిల్లల తల్లిదండ్రులనుద్దేశించి ప్రయివేటు పాఠశాల ప్రతినిధి పిల్లల డైరీలలో రాసి పిల్లలను, వారి తల్లిదండ్రులను మానసిక ఆవేదనకు గురిచేస్తున్న ఘటన వెలికివచ్చింది. క్రమశిక్షణ, నాణ్యమైన విద్యకు చిరునామా అంటూ ప్రచారం చేసుకుంటున్న కారేపల్లి లోని నిర్మల్ స్కూల్లో నలమాద వెంకటరాహుల్ నర్సరీ నుండి చదువుతున్నాడు. ప్రస్తుతం 9వ తరగతి చదువుతుండగా రాహుల్ డైరీలో మంగళవారం పాఠశాల ప్రతినిధి మీ బాబుకు పాఠశాల పట్ల గౌరవం లేదని వచ్చే ఏడాది పదోతరగతికి వేరే పాఠశాల చూచుకోవాలంటూ రాసింది. దీనిపై ఆ విద్యార్థి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పిల్లవాడు ఆ తరగతిలో మంచి మార్కులు వస్తున్నాయని, అయినా పాఠశాల సీనియర్ సిస్టర్ రాహుల్ను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. నర్సరీ నుండి విద్యాబుద్ధులు చెప్పిన ఆదే పాఠశాలకు పదోతరగతిలో తమ పిల్లవాడులో లోపాలు ఉన్నాయంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తమ పిల్లవాడిని,తమను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్న స్కూల్ యాజమాన్యంపై ఉన్నతాధికారులకు పిర్యాదు చేయనున్నట్లు విద్యార్థి తండ్రి రమేష్ తెలిపారు.

# ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ప్రముఖ క్రిటికల్ కేర్ వైద్యులు డాక్టర్ అక్కినేని లోకేష్

చదువుల తల్లి చదువు కోసం రూ.23వేలు ఆర్థిక సాయం



**భద్రాచలం, ఫిబ్రవరి 18, (జనంసాక్షి):** ఇష్టంతో కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రముఖ క్రిటికల్ కేర్ వైద్యులు డాక్టర్ అక్కినేని లోకేష్ అన్నారు. స్థానిక ఆదర్శనగర్ కాలనీకి చెందిన పేద విద్యార్థిని గుండిపూడి ఛార్మిల పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కళాశాలలో బైపిసి మొదటి సంవత్సరం చదువుతుంది. బాగా చదువుకోవాలన్న ఆకాంక్ష తపన ఉన్నా కూడా ఆర్థిక పరిస్థితి బాగోలేక చదువు కష్టంగా మారింది. గత కొంతకాలంగా తల్లిదండ్రుల యొక్క ఆరోగ్యం బాగోలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతుండటంతో పేద విద్యార్థి చదువు కోసం మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ సురక్ష హాస్పిటల్ డైరెక్టర్, ప్రముఖ క్రిటికల్ వైద్య నిపుణులు డాక్టర్ అక్కినేని లోకేష్ చేతుల మీదుగా పేద విద్యార్థినికి రూ. 23వేలు మంగళవారం అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లోకేష్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న పేద విద్యార్థినికి నేనున్నానంటూ ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించిన ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. ప్రశాంత వాతావరణంలో ఎగ్జామ్స్ మంచిగా రాయాలని కోరారు. అలాగే విద్యార్థిని చదువు కోసం ట్రస్ట్ సభ్యులు రూ. 8వేలు, ఎస్ ఎల్ బి టి పెయింట్స్ యజమానులు వేణు రాజ్, వివి. సూర్య తేజ , అబ్దుల్ ఊఫర్ రూ.10వేలు, సురక్ష హాస్పిటల్ తరఫున రూ. 5వేలు అందజేయడం జరిగిందని ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల మురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు చోళ ఇన్సూరెన్స్ మేనేజర్ బాలరాజు, సాయి కుమార్, కోమటిరెడ్డి చైతన్య, జే నాగరాజు, బూరం నవీన్ , ఎడ్విన్ కిషోర్,తదితరులు పాల్గొన్నారు.